
అమృత్ కిరణ్ కథలపోటీలో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ

# వ్యత్యాసం



గరిమెళ్ళ నారాయణ

మధ్యాహ్నం మూడు గంటలు కావస్తోంది. వేసవికాలం కావడం వల్లేమో ఎండతీవ్రత ఎక్కువగా ఉంది.

ఈ ఎండల్లో, ఓ గంటసేపు కూర్చుని వినే ఆ లెక్కల ప్రైవేట్‌కి వెళ్ళకపోతే వచ్చే నష్టమేంటో అనుకుంటూ సైకిల్‌ని భారంగా తొక్కుతూ వెళ్ళడం మొదలెట్టేను. వెళ్తున్నది మెయిన్ రోడ్డుమీద కాబట్టి, ఒళ్ళు దగ్గరుంచుకుని సైకిల్ తొక్కుతున్నాను.

ఇంతలో నా ముందెళ్తున్న స్కూటర్ మీంచి కొన్ని పుస్తకాలు రోడ్డంతా చిందర వందరగా పడిపోయాయి. స్కూటర్ నడుపుతోన్న వ్యక్తి అది గమనించి, తన స్కూటర్ని రోడ్డుకి ఒక పక్కగా స్టాండ్ వేసి, తన ఇన్‌షర్ట్‌ని సర్దుకుంటూ హడావిడిగా పుస్తకాల వైపు వస్తున్నాడు.

ఆయనకి సాయపడాలనే ఉద్దేశ్యంతో సైకిల్‌ని రోడ్డుప్రక్కన స్టాండ్‌వేసి అటువైపు వెళ్ళాను. ఆ సరికే కొన్ని పుస్తకాలు వచ్చేపోయే వాహనాల కిందపడి నలిగిపోయాయి.

మిగిలినవి కూడా నలిగిపోకూడదనే ఉద్దేశ్యంతో రోడ్డుకు మధ్యగా పడిఉన్న కొన్ని పుస్తకాలను హడావిడిగా ఏరేను. అతనుకూడా పుస్తకాలను గబగబా ఏరుతున్నాడు. మేం రోడ్డు మీద ఉండడం వల్ల వచ్చేపోయే వాహనాల రాకపోకలకు కొంచెం అంత రాయం ఏర్పడింది.

అన్ని పుస్తకాలు ఏరెయ్యడం అయిపోయాక ఆయన తన స్కూటర్‌వైపు నడిచాడు. నలిగిపోయిన పుస్తకాలను చూసి, "ప్చ్" అంటూ చికాకుతో కూడిన బాధను వ్యక్తం చేశాడు.

ఆయన స్కూటర్‌ను సమీపించాక, ఒక తాడును తీసి సీటుమీద ఉంచాడు. నేను దాని సాయంతో పుస్తకాలన్నింటినీ కట్టకట్టాను.

ఆ కట్టను తీసి, ఆయన స్కూటర్‌పై తను కాళ్ళు పెట్టుకునే దగ్గర దాన్ని ఉంచి, స్టాండు తీశాడు.

తన కూలింగ్ కళ్ళద్దాలను సవరించుకుంటూ నావైపు చూసి "థాంక్స్" చెప్పాడు.

"ఆ ఫరవాలేదు లెండి" అని నేను అంటూండగానే దాన్ని స్టార్ట్ చేసి స్పీడుగా వెళ్ళిపోయాడు.

ఆ పుస్తకాలు మళ్ళీ పడిపోతాయేమోనన్న సందేహంతో నేను కొంత సేపు అటువైపు చూస్తూండిపోయాను.


★ ★ ★

మధ్యాహ్నం ఒంటి గంటయ్యింది. బయట ఏదో శబ్దం విని "ఐసొచ్చింది" అంటూ మా అక్క కొడుకు ఎగిరి గంతేశాడు.

వెంటనే "ఐస్‌ఫ్రూట్‌కొనూ" అంటూ పేచీకి శ్రీకారం చుట్టాడు.

వాడి బాధ పడలేక షర్ట్ మార్చుకుని, వాడిని తీసుకుని వీధిలో కొచ్చాను.

"ఏయ్, ఇలారా" అని ఐసువాడి వైపు చూసి,



పిలిచేసరికి వాడు తన సైకిల్‌ని నడిపించుకుంటూ మా దగ్గరకు వచ్చాడు.

"ఒక ఐస్‌ఫ్రూటివ్వు" అని వాడి చేతిలో రూపాయి నాణెం ఉంచాను. వాడొక ఐస్‌ఫ్రూట్‌ను తీసిచ్చాడు. అది మా అక్క కొడుక్కి అందించాను. ఇంతలో ఒక ఏడేళ్ళ పిల్లోడు కంగారుగా పరిగెత్తుకుంటూ వచ్చి ఐస్‌ఫ్రూట్‌వాడి వైపు చూసి "ఇగో పచ్చైసివ్వా" అంటూ ఆయాసపడుతూ అడిగాడు.

అందుకు వాడు ఒక పసుపు రంగు ఐస్‌ఫ్రూట్‌ను తీసి ఆ పిల్లాడి చేతికి ఇచ్చాడు.

ఆ పిల్లాడు డబ్బుల కోసమని తన షర్ట్ జేబులోకి చెయ్యి దూర్చాడు.

తన చేతిరెండు వేళ్ళు జేబుకున్న కన్నంలో నుండి బైటకు వచ్చేసరికి ఐస్‌ఫ్రూట్ కొనడం కోసమని తను తెచ్చిన డబ్బులు ఎక్కడోపడిపోయాయని గ్రహించి, ఉలిక్కిపడ్డాడు.

చిన్న ఏడుపు ఛాయలు కనిపిస్తూండగా ఆ పిల్లాడు ఐస్‌ఫ్రూట్‌ని ఐస్ వాడికి అందించబోయాడు.

నేను ఆ పిల్లాడి చేతికి ఐస్‌తో పాటు నెమ్మదిగా వెనక్కు నెట్టి, ఐస్ వాడికి నా జేబులో నున్న మరొక రూపాయి నాణేన్ని అందించాను.

అది చూసిన ఆ పిల్లాడి లో చిన్న ఆనందం తొంగి చూసింది. నాతో ఏదో మాట్లాడాలనుకున్నాడు.

అందుకు నిదర్శనంగా అతని రెండు పెదవులూ కదిలాయి. కాని ఎందుకో, ఏం మాట్లాడలేదు. చిన్న నవ్వుతో ఆ పిల్లాడి కళ్ళు మెరుస్తూ ఉంటే నేను వాటివైపు చూస్తూ ఉండిపోయాను.

నావైపు కృతజ్ఞతా పూర్వకంగా చూసి, చివరలు

అరిగి చిరిగిపోయిన తన రబ్బరు జోళ్ళు కాలి మడమలతో కలిసి శబ్దం చేస్తూఉంటే, గుండీలు లేని తన షర్ట్ రెండు చివరలూ గాలికి విడిపోయి ఎగురుతూంటే, జారి పోతోన్న తన నిక్కరుని పైకి తోసుకుంటూ, వెనక్కి చూస్తూ ఆ పిల్లాడు పరిగెత్తుకుంటూ వెళ్ళిపోయాడు.

★ ★ ★

అది మే నెల. మధ్యాహ్నం పదకొండున్నరవుతోంది. ఎవరో రాజకీయ నాయకుడు హత్య చెయ్యబడటం వల్ల ఆ పార్టీ నాయకులు ఆ రోజు బంద్‌కు పిలుపు నిచ్చారట.

ఫలితంగా ఎప్పుడూ హడావిడి గా ఉండేరోడ్లు బోసిపోయాయి. ఎండకూడా ఎక్కువగా ఉండడం వల్ల రోడ్లమీద మనుషులు కూడా చాలా తక్కువగా ఉన్నారు.

వీధిలో తిరిగి తిరిగి ఇంట్లోకొచ్చి కూర్చున్న నన్ను చూసి నాన్నగారు, తనమిత్రుడి కూతురి పెళ్ళి ఉండడం వల్ల తను ఆఫీసుకి సెలవు పెట్టాననీ, కొన్ని కాగితాలను అర్జంటుగా ఆఫీసుకు పంపాలనీ, అందుకోసం నన్ను వాళ్ళ ఆఫీసుకెళ్ళమని పురమాయించారు.

ఫలితంగా పద్దెనిమిది కిలోమీటర్ల దూరంలో ఉన్న పల్లెటూరి ఎండలో, సైకిల్ మీద బయల్దేరడం నా వంతయ్యింది.

నేను బట్టలు మార్చుకుని, మూడ్రోజుల క్రితం కొనుక్కున్న టోపీని ఎండవేడి తట్టుకునేందుకు గాను బుర్రమీద తగిలించుకుని, నాన్నగారిచ్చిన కాగితాలని జేబులో పెట్టు కుని సైకిల్ తొక్కుకుంటూ బయల్దేరాను.

ఆడుతూ పాడుతూ ఊరి నుండి ఆరు కిలోమీటర్ల దూరం వచ్చాను. ఊరికి దూరం అవుతూండడంతో రోడ్డుకి రెండు ప్రక్కలా పచ్చగా పండిన పంట పొలాలు, వాటిలోకి దారి తీస్తున్న పంటకాలువలూ కనిపిస్తున్నాయి.

వాటిని చూస్తూ ఏదో ఆలోచించుకుంటూ ముఖానికి పట్టిన చెమటను రుమాలుతో వత్తుకున్నాను.

ఇంతలో నేవెళ్ళే రోడ్డుమీద కొంచెం దూరంలో ఒకాయన వెళ్తూ కనిపించాడు.

సైకిల్ అతనికి దగ్గరౌతూండడంతో అతనంత ఎండలో వట్టి కాళ్ళతో తారు రోడ్డుమీద నడుస్తున్నాడని అర్థం అయ్యింది.

అతని చేతిలో ఉన్న క్యారేజీ, మాసిపోయి చిరుగులు పడి ఉన్న అతని ఖద్దరు బనీనూ, చెవిలో చుట్ట, నల్లగా ఉన్న అతని శరీరం చూస్తూంటే అతనో కూలీవాడని అర్థం అయ్యింది. నేనెళ్ళే వైపుగానే అతనూ వెళ్తున్నాడు. మధ్య మధ్యలో ఆగి ఆగి వెనక్కి చూస్తున్నాడు.

బహుశా ఎవరైనా నాలా ఖాళీగా సైకిల్‌పై వస్తోన్న వాళ్ళని లిఫ్ట్ అడుగుదామన్నట్టుంది అతని ఉద్దేశం. అతని స్వరూపాన్ని చూసి నాకు అసహ్యం అనిపించి, అతన్నన్ను సైకిలెక్కించమని అడగకపోతే బావుణ్ణు' అని అనుకున్నాను.

సరిగ్గా నా సైకిల్ అతన్ని సమీపించేసరికి "ఇగో బాబూ, కొంచిల్లిక్కడకే, ఎక్కించి పెట్టవూ" అన్నాడు బ్రతిమాలుతూ.

"గాలిచాలదయ్యా" అంటూ సైకిల్ టైర్లలోని గాలిచాలదని వంకపెట్టి ముందుకి బయల్దేరాను.

రెండడుగుల దూరం సైకిల్‌తో పాటు పరిగెత్తి "బాబ్బా బు, బాబ్బాబు" అంటూ ప్రాధేయపడ్డాడు.

నేనతన్ని పట్టించుకోలేదు. నీటుగా ఫ్యాంటూ, షర్టూ వేసుకున్న నాకు అలాంటి వాణ్ణి నా వెనక కూర్చోపెట్టుకుని సైకిల్ తొక్కాలంటే అదోలా అనిపించింది.

అతన్నించి దాదాపు ఓ పది అడుగుల దూరం వెళ్ళాను. నా మనసు ఒక్కసారి చివుక్కుమంది.

సాటి మనిషి ఎండలో చెప్పుల్లేకుండా నడుస్తూ ఉంటే అతనిని పట్టించుకోకుండా వచ్చేసిన నా వైనానికి, నాకే సిగ్గనిపించింది.

వెంటనే సైకిల్‌ను వెనక్కు మళ్ళించి కూలి వాడి దగ్గరకెళ్ళి, కూలివాడిని వెనక కూర్చోమన్నాను. అతడు సంతోషంతోవచ్చి కూర్చున్నాడు. 'ఇందాక గాలి చాలదన్నావు' అని అడుగుతాడేమో ననుకున్నాను.

కాని, నా గురించి తెలిసిన వాడిలా ఏం మాట్లాడలేదు. సైకిల్‌ని స్పీడుగా తొక్కడం మొదలెట్టేను.

కొంతదూరం వెళ్ళాక పూరిగుడిసెలు కనిపించాయి.

"ఇదే బాబూ మా ఊర్షు" అని కూలివాడు చెప్పాడు,

కొంచెం ముందుకెళ్ళాక "ఇక్కడాపేయండి బాబూ" అన్నాడు.

అక్కడకి దగ్గరలో ఉన్న ఓ గుడిసెవైపు చూపించి అదే తన ఇల్లని చెప్పాడు.

తరువాత నా చేతులు పట్టుకుని "మంచోడివి, జాగరత్తగా ఎల్లు బాబూ" అని "మంచీళ్ళు కావాలేటి?" అని అడిగాడు.

'వద్దులే' అని చెప్పాను. అతని చేతివేళ్ళకున్న మట్టి నా చేతులకు అంటుకుంది.

దాన్ని చూసి, అతను తను కట్టుకున్న తలపాగా గుడ్డతీసి ఆ మట్టిని తుడిచాడు. ఎండకి ఎర్రబడ్డ అతని కళ్ళల్లో ఏదో చల్లని భావం కనిపిస్తోంది.


"జాగ్రత్త బాబూ... ఆ..." అని మళ్ళీ అని వెళ్ళిపోతూ "మరిసెలవు బాబూ... ఆ..." అంటూ వెనక్కి తిరిగి చూస్తూ అతను వెళ్ళిపోతున్నాడు. నా పని గుర్తొచ్చి అక్కణ్ణించి తొందరగా వెళ్ళిపోయాను.

★ ★ ★

స్కూటర్‌మీద పోతోన్న వ్యక్తి తన 'కృతజ్ఞత' ని ప్రత్యక్షంగా చెప్పినా ధానిలో కనిపించని కృతజ్ఞత- కూలి వాడు, చిన్న పిల్లాడు ఎక్కడా 'కృతజ్ఞత' అనే పదానికి సంబంధించిన మాటలు చెప్పకపోయినా అందులో కని పించిన కృతజ్ఞతా నన్ను ఆశ్చర్యంలో ముంచెత్తాయి.

కల్మషంలేని ఓ చిరు హృదయం, మలినం కాని ఓ కూలివాడి మనసుల్లోంచి పెల్లుబికిన భావాలకు, నవనాగరికత నుండి ఊడిపడిన ఓ నవ్య పదానికి మధ్యగల వ్యత్యాసాన్ని ఎవ్వరూ పూడ్చలేరని తెలిసింది. హృదయంలో నుండి వచ్చే భావాలు హృదయాన్ని కట్టి పడెయ్యగలవనీ, నాలిక చివరల నుండి రాలి పడిన మాటలు గాలిలో కొట్టుకు పోతాయని ఋజువయ్యింది.

★




వి. బావాజి, కార్టూనిస్ట్, కురబలకోట-517350, జిల్లా:చిత్తూరు.